సాక్షి
వికారాబాద్

శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



ఆనకట్ట.. ఒట్టిమాటేనా?
ధారూరు మండలంలోని దోర్నాల్ గ్రామ సమీపంలో పెద్ద వాగుకు అడ్డంగా ఆనకట్ట నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. 8లో▸



రాష్ట్రంలో బీజేపీదే అధికారం
రానున్న ఎన్నికల్లో బీజేపీదే అధికారమని ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఏ చంద్రశేఖర్ ధీమా వ్యక్తం చేశారు. 8లో▸



అన్ని వర్గాల ప్రజలకు న్యాయం
ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

పర్వతారోహణలో శిక్షణకు తరలిన విద్యార్థులు



బస్సులో భువనగిరికి వెళ్తున్న విద్యార్థులు

వికారాబాద్ అర్బన్: కళాశాల, వసతిగృహాల్లో చదువుతున్న వంద మంది విద్యార్థులకు పర్వతారోహణలో శిక్షణ ఇచ్చేందుకు శుక్రవారం భువనగిరి ఖిల్లాకు పంపించామని జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మూడు బస్సుల్లో విద్యార్థులను తరలించినట్లు తెలిపారు. పర్వతారోహణలో ఆసక్తి ఉన్న విద్యార్థులకు శిక్షణ ఇప్పించి, వారి నైపుణ్యం ఆధారంగా ప్రోత్సహిస్తామని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ, భీమ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల పన్ను చెల్లించండి

వికారాబాద్ అర్బన్: జిల్లాలోని వాహనదారులు సకాలంలో పన్ను చెల్లించాలని జిల్లా రవాణా శాఖ అధికారి శుక్రవారం వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 4,769 వాహనాలు పన్ను చెల్లించకుండా తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. పట్టుబడితే అపరాధ రుసుముతో మొత్తం రూ.300 చెల్లించాల్సి వస్తుందని స్పష్టంచేశారు. జిల్లాలో సుమారు రూ.3,50,23,190 పన్ను బకాయి ఉన్నట్లు తెలిపారు. పెద్దఎత్తున బకాయిలు పేరుకుపోవడంతో ఉన్నతాధికారుల ఆదేశం మేరకు తనిఖీలు చేపడుతూ వాహన పన్ను వసూలు చేస్తున్నట్లు చెప్పారు.

వాహనాల వేలం పూర్తి



వాహనాలను వేలం వేయిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్ అర్బన్: వదిలివేయబడిన, క్లెయిమ్ చేయలేని వాహనాలను వేలం వేశామని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఈ బహిరంగ వేలానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. బహిరంగ వేలంలో 11 త్రిచక్ర వాహనాలు, 18 ద్విచక్ర వాహనాలను వేలం వేశామన్నారు. వేలంలో పొందిన వాహనాలను ఉపయోగించకూడదని, డీమాలిష్ చేసి తీసుకెళ్లాలని తెలిపారు.

పాతూరులో పశువైద్య శిబిరం



పశువులకు చికిత్స చేస్తున్న సిబ్బంది

వికారాబాద్ అర్బన్: పాడి పశువుల్లో గర్భకోశ వ్యాధులు రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తాయని పశుసంవర్ధక శాఖ ప్రాంతీయ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పూర్ణచందర్‌రావు తెలిపారు. పాతూరులో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ టి.ఉష ఆధ్వర్యంలో సుమారు వంద మూగజీవాలకు చికిత్సలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు.

కాంగ్రెస్ ప్లీనరీకి యూసుఫ్‌కు ఆహ్వానం



కొడంగల్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్ జిల్లాలో నిర్వహించనున్న కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశానికి రావాలని కొడంగల్‌కు చెందిన పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ శుక్రవారం ఆయనకు ఫోన్ చేశారు.పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి యూసుఫ్ ప్రధాన అనుచరుడిగా గుర్తింపు పొందారు.కొడంగల్‌లో మైనార్టీ నేతగా ఎదిగారు. ఈ మేరకు కాంగ్రెస్, మైనార్టీ నాయకులు యూసుఫ్‌కు అభినందనలు తెలిపారు.

గొర్రెలమందపై వీధికుక్కల దాడి

30 గొర్రెపిల్లల మృతి

ఆమనగల్లు: పోలెపల్లిలో శుక్రవారం సాయంత్రం గొర్రెల మందపై వీధికుక్కలు దాడిచేశాయి. ఈ ఘటనలో 30 గొర్రెపిల్లలు మృత్యువాతపడ్డాయి. రైతు ఎట్టయ్యయాదవ్ తన పొలం వద్ద గొర్రెలను ఉంచగా అదే సమయంలో కుక్కలు దాడిచేశాయి. మందలో ఉన్న 30 గొర్రెపిల్లలు మృతి చెందాయి.

కదిలిన యంత్రాంగం

- కలెక్టర్ నారాయణరెడ్డి రాకతో అప్రమత్తమైన అధికారులు
- క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ అభివృద్ధి పనుల పరిశీలన
- నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- డంపింగ్ యార్డులు, శ్మశానవాటికల సందర్శన



నర్సరీలో ఎండిన మొక్కలను తొలగించి కొత్త మొక్కలు నాటుతున్న ఏపీఓ దస్తయ్య, సిబ్బంది

దోమ: కొత్త కలెక్టర్‌గా నారాయణరెడ్డి విధుల్లో చేరిన రోజునుంచి అధికారుల పనితీరులో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. గ్రామాలు, మున్సిపాలిటీల్లో చేపడుతున్న పనులను శుక్రవారం ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కలెక్టర్ నారాయణరెడ్డి గురువారం దోమ మండలంలో పర్యటించిన విషయం తెలిసిందే. జిల్లా వ్యాప్తంగా అప్రమత్తమై యంత్రాంగం విధుల్లో చురుగ్గా పాల్గొంటోంది. ప్రజా సమస్యల పరిష్కారంపై కిందిస్థాయి సిబ్బంది సైతం దృష్టిసారించారు.

పనుల పురోగతికి ప్రత్యేక చర్యలు

దోమ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓ పర్యటించారు. పల్లెల్లో చేపట్టాల్సిన పనులపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. అర్ధంతరంగా ఆగిపోయిన పనుల వివరాలు సేకరించడంతో పాటు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. దోర్నాల్‌పల్లిని సందర్శించిన కలెక్టర్ నర్సరీ నిర్వహణ, పల్లె ప్రకృతి వనంపై అసహనం వ్యక్తంచేయడంతో అధికారులు పనులు చేపట్టారు. నర్సరీలో ఎండిన మొక్కలను తొలగించి నూతన మొక్కలు నాటించారు. పల్లె ప్రకృతి వనంలో ఉన్న మొక్కలకు నీరందించి, కొత్త మొక్కలు నాటారు. ప్రజల సౌకర్యార్థం బెంచీలు, కుర్చీలు, రోడ్లు వేయాలని ఆదేశించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఐనాపూర్, మోత్కూర్, దోమ, పాలేపల్లి, దిర్సంపల్లి, మల్లేపల్లి తదితర గ్రామాలను సందర్శించి నర్సరీ, పల్లె ప్రకృతి వనం,డంపింగ్‌యార్డు, శ్మశానవాటిక పనులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా పెట్టుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. నర్సరీ నిర్వహణను అశ్రద్ధ చేయొద్దని సిబ్బందిని ఆదేశించారు. పల్లె ప్రకృతి వనాలను పార్కుల్లా సుందరీకరించాలన్నారు.

గ్రామాల్లో పర్యటిస్తున్నాం



ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల్లో వేగం పెంచేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి గ్రామాన్ని సందర్శించి, పనులను పరిశీలిస్తున్నాం. నర్సరీల నిర్వహణ, పల్లె ప్రకృతివనం, శ్మశానవాటిక పనులు, క్రీడాప్రాంగణాలు, పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం.

– జయరాం, ఎంపీడీఓ, దోమ

మెరుగైన సేవలకే అటెండెన్స్ యాప్

- ఉద్యోగులందరూ విధిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి
- ఎవరినీ ఇబ్బంది పెట్టే ఉద్దేశం లేదు
- కలెక్టర్ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్

వికారాబాద్ అర్బన్: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతోనే జిల్లాలో అటెండెన్స్ యాప్‌ను ప్రవేశపెట్టామని, ఇందులో అధికారులు, ఉద్యోగులను ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం ఎంతమాత్రం లేదని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తన చాంబర్ నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులందరూ రెగ్యులర్‌గా విధులు నిర్వహించి ప్రజలకు సత్వర సేవలు అందిస్తే జిల్లాను ఉన్నత స్థానంలో నిలిపే అవకాశం ఉంటుందన్నారు. టాప్– 5 సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. సోమవారం నుంచి వందశాతం మంది అటెండెన్స్ యాప్ ద్వారా హాజరు వేయాలని కోరారు. ఇరవై రోజులుగా ఈ విషయమై ప్రత్యేక దృష్టిసారించినప్పటికీ ఇంకా కొన్ని శాఖల సిబ్బంది యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోలేదని, ఇది క్రమశిక్షణా రాహిత్యం కిందకు వస్తుందని హెచ్చరించారు. పలువురు అధికారులు స్పందిస్తూ షిఫ్టింగ్ డ్యూటీలు, ఇతర టెక్నికల్ సమస్యల కారణంగా యాప్ డౌన్‌లోడ్ చేసుకోలేదని కలెక్టర్‌కు వివరించారు.

రెండు ప్రైవేట్ ఆస్పత్రులు సీజ్



సిద్ధార్థ ఆస్పత్రిని సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

చేవెళ్ల: అనుమతులు లేకుండా గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేస్తున్న రెండు ప్రైవేటు ఆస్పత్రులను జిల్లా వైద్యాధికారులు సీజ్ చేశారు. శుక్రవారం సాయంత్రం జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి మండల కేంద్రంలో ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేశారు. సిద్ధార్థ క్లినిక్ పేరుతో హోమియోపతి డాక్టర్ హైమావతి నిర్వహిస్తున్నారు. ఈ ఆస్పత్రిలో గర్భిణులకు స్కానింగ్‌పరీక్షలు, లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో దాడులు చేశారు. క్లినిక్‌లో 12 మంది గర్భిణులు స్కానింగ్ కోసం రావడాన్ని అధికారులు గమనించారు. అనుమతులులేకుండా స్కానింగ్ చేసినందుకు మిషన్లను సీజ్ చేశారు. మరో ప్రైవేటు ఆస్పత్రి అయిన ప్రజావైద్యశాలలో కూడా ఇదేరకమైన స్కానింగ్ పరీక్షలు జరుగుతున్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. ఈ రెండు ప్రైవేటు ఆస్పత్రులను సీజ్ చేసి కేసు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఆకస్మిక తనిఖీల్లో వైద్యఅధికారులు రాకేశ్, శ్రీనివాస్‌రెడ్డి, దామోదర్‌లు, సీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి, చేవెళ్ల ఎస్‌ఐ హయ్యూం, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

నువ్వా.. నేనా

- తాండూరు లారీ ఓనర్స్ ఎన్నికల్లో ద్విముఖ పోటీ
- ఓటు హక్కు వినియోగించుకోనున్న 261 మంది సభ్యులు



అబ్దుల్ గని



శ్రీనివాస్

తాండూరు టౌన్: తాండూరు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలను ఆదివారం నిర్వహించనున్నారు. పట్టణంలోని వైట్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ కొనసాగనుంది. సాయంత్రం 6గంటల లోపు ఫలితాలు వెల్లడిస్తారు. 2023– 25 సంవత్సరానికి గాను విడుదలైన ఎన్నికల షెడ్యూల్ ప్రకారం నామినేషన్ ప్రక్రియ గురువారం ముగిసింది. కేవలం ఇద్దరు అభ్యర్థులు మాత్రమే బరిలో నిలిచారు. శుక్రవారం ఉప సంహరణ గడువు ఉండగా ఎవరూ తమ నామినేషన్‌ను వెనక్కి తీసుకోలేదు. దీంతో ఎన్నిక అనివార్యమైంది. అబ్దుల్ గని, చిక్కాల శ్రీనివాస్ తుది పోరులో నిలిచారు. గనికి టైరు గుర్తు, శ్రీనివాస్‌కు పాన గుర్తును కేటాయించారు. అసోసియేషన్‌లో గుర్తింపు పొందిన 261 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సభ్యులందరూ తప్పకుండా అసోసియేషన్ జారీ చేసిన గుర్తింపు కార్డుతో రావాలని, ఎన్నికల నిబంధనలు పాటించని వారిని ఓటు వేసేందుకు అనర్హులుగా ప్రకటిస్తామని ఎన్నికల అధికారి, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అడ్వకేట్ గోపాల్ తెలిపారు. తమను గెలిపిస్తే లారీ ఓనర్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అభ్యర్థులిద్దరూ సభ్యులను కోరారు.

స్పేస్ సదస్సుకు మహేశ్వరం విద్యార్థులు

మహేశ్వరం: స్థానిక ప్రభుత్వ మోడల్ స్కూల్ నుంచి తొమ్మిది మంది విద్యార్థులకు అమెరికా టెక్సాస్ నగరంలో నిర్వహించే ఇంటర్నేషనల్ స్పేస్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్‌కు ఆహ్వానం రావడం గర్వించదగ్గ విషయమని మంత్రి సబితారెడ్డి అన్నారు. అమెరికా నుంచి ఆహ్వానం అందుకున్న విద్యార్థులు శుక్రవారం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందించారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ మోడల్ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఆహ్వానం అందడం అభినందనీయమని, సర్కారు బడుల్లో నాణ్యతతో కూడిన విద్య అందుతుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బాబు, మాజీ ప్రిన్సిపాల్ బి. ధనుంజయ్, కేసీ తండా సర్పంచ్ మోతిలాల్ నాయక్, ఉప సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ రవి నాయక్, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

పత్తాలేని న్యూట్రిషన్ కిట్లు!

- సరఫరాలో తీవ్ర జాప్యం
- పథకం అమలులో ఆదిలోనే ఇబ్బందులు
- కిట్ల కోసం ఎదురు చూస్తున్న గర్భిణులు



న్యూట్రిషన్ కిట్ల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ, అధికారులు

వికారాబాద్ అర్బన్: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను తగ్గించి పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది డిసెంబర్‌లో న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ప్రారంభానికి ఎంతో ఆర్భాటం చేసిన సర్కారు రెండు నెలలు గడవక ముందే సరఫరాలో తీవ్ర జాప్యం చేస్తోంది. ఇదేమని ప్రశ్నిస్తే పైనుంచి రావడం లేదని క్షేత్ర స్థాయి సిబ్బంది చెబుతున్నారు.

ప్రసవానికి ముందు, తర్వాత

ప్రసవానికి ముందు 5వ నెలలో ఒకసారి, 9వ నెలలో మరోసారి న్యూట్రిషన్ కిట్లు ఇవ్వాలి. మొదటిసారి స్థానికంగా ఉండే పీహెచ్‌సీలలో, రెండోసారి (9వ నెలలో) ఏరియా ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ ద్వారా పరీక్షలు, స్కానింగ్‌లు పూర్తయిన తర్వాత ఇవ్వాలి. ప్రసవం తర్వాత కూడా మరో రెండు సార్లు కిట్లు పంపిణీ చేయాలి.

ఫుడ్ ఇదే..

కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌లో కిలో న్యూట్రిషన్ మిక్స్ పౌడర్, మూడు ఐరన్ సిరప్ సీసాలు, కిలో కర్జూరా, ప్లాస్టిక్ బుట్ట, వస్త్రం సంచి, 500 గ్రాముల నెయ్యి, బలం మాత్రలు, ఒక కప్పు ఉంటుంది. దీనిద్వారా మహిళల్లో రక్త హీనతను తగ్గించాలనేదే ప్రధాన ఉద్దేశం.

మొదట్లో హడావుడి

కిట్ల పంపిణీ ప్రారంభంలో శాఖ అధికారులు, పాలకులు చాలా హడావుడి చేశారు. నెల రోజులకు పైగా కిట్ల పంపిణీ లేకపోవడంతో పథకం అభాసుపాలవుతోంది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నుంచే జిల్లాకు కిట్ల సరఫరా జరగడం లేదని సమాచారం. ప్రారంభంలో కొందరు గర్భిణులకు కిట్లు అందడంతో వారి నుంచి మంచి స్పందన వచ్చింది. మొదటగా కిట్ తీసుకున్న వారు రెండో దానికోసం, కొత్తగా కిట్ తీసుకునేందుకు మరికొందరు గర్భిణులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కిట్లు సరఫరా చేయాలని కోరుతున్నారు.

మొదటి కిట్‌కు అర్హులు	కిట్లు తీసుకున్నవారు
7,557	4,046
రెండో కిట్‌కు అర్హులు	కిట్లు పొందిన వారు
3,515	1,024

ప్రాధాన్యతా క్రమంలో ఇస్తున్నాం

ఆన్‌లైన్‌లో నమోదైన వారికి ప్రాధాన్యత క్రమంగా ఇస్తున్నాం. పైనుంచి సరఫరా వచ్చిన ప్రకారం అర్హులకు పంపిణీ చేస్తున్నాం. కొంత ఆలస్యం జరిగినా అందరికీ వచ్చేలా చూస్తాం.

– డాక్టర్ పాల్వాన్ కుమార్, డీఎంహెచ్‌ఓ

అందింది కొందరికే..

జిల్లాలో న్యూట్రిషన్ కిట్ల పథకం కొంతమందికే అందింది. 11,072 మంది ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోగా ఇప్పటి వరకు 5,070 మందికి మాత్రమే కిట్లు ఇచ్చారు. వివరాలు నమోదు చేసుకోని వారు సైతం చాలామందే ఉన్నారు.

జిప్సం ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం



ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న పొగలు

భారీగా ఎగిసిపడిన మంటలు

- గుంతబానుపల్లిలో ఘటన
- నాలుగు ఫైరింజన్లతో మంటలు ఆర్పిన సిబ్బంది

తాండూరు రూరల్: గుంతబానుపల్లి శివారులోని ఇండస్ కెమ్ జిప్సం ఫ్యాక్టరీలో శుక్రవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో కర్మాగారం నుంచి దట్టమైన పొగలు వెలువడ్డాయి. పెద్దమొత్తంలో వ్యాపించిన మంటలతో ఫ్యాక్టరీ పరిసరాలు భయానకంగా మారాయి. కర్ణాటకలోని చించోలి, తాండూరు, వికారాబాద్, కొడంగల్ నుంచి వచ్చిన నాలుగు ఫైరింజన్లు మంటలను అదుపులోకి తెచ్చాయి. విషయం తెలుసుకున్న గుంతబానుపల్లి, మిట్టబానుపల్లి, మల్కాపూర్ గ్రామాల ప్రజలు వందలాదిగా తరలివెళ్లారు. ఈ ఘటనలో భారీ ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను శనివారం వెల్లడిస్తామని ప్రకటించారు.

వ్యర్థాలను తెచ్చి..

గుంతబానుపల్లి సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా జిప్సం ఫ్యాక్టరీ కొనసాగుతోంది. కర్ణాటక రాష్ట్రం బీదర్, తెలంగాణలోని పటాన్‌చెరు, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ఫార్మా కంపెనీల్లో వెలువడే వ్యర్థాలను తీసుకొచ్చి, స్థానికంగా లభించే సుద్దను మిక్స్ చేసి సిమెంట్ ఫ్యాక్టరీల్లో వినియోగించే ముడి సరుకును తయారు చేస్తారు. ప్రతి రోజు రాత్రి వేళల్లో యాసిడ్ డ్రమ్ములను లారీల్లో ఇక్కడకు తీసుకొస్తారు. వీటిని ఫ్యాక్టరీ బయట ఖాళీ ప్రదేశంలో నిల్వ చేస్తారు.



ఫ్యాక్టరీని మూసివేయాలంటూ ఆందోళనకు దిగిన గ్రామస్తులు

ప్రజల నిరసన

జిప్సం ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుర్వాసన, పొగ కారణంగా సమీప గ్రామాల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పంట చేలు పాడవుతున్నాయి. కర్మాగారం నుంచి విడుదలయ్యే రసాయనాలు నేలలో ఇంకి భూగర్భ జలాలు సైతం కలుషితమవుతున్నాయి. రాత్రి వేళ నిద్ర పట్టడం లేదని, శ్వాస తీసుకోవడం కష్టమవుతోందని పలుమార్లు ఆందోళన చేపట్టారు. ఫ్యాక్టరీని మూసేయాలని కోరుతూ నిరాహార దీక్షలు సైతం చేపట్టారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులతో పాటు జిల్లా స్థాయి అధికారులకు సైతం ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు అందలేదు

జిప్సం ఫ్యాక్టరీ కారణంగా తమ ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని అధికారులను ఎన్నిసార్లు వేడుకున్నా ఫలితం లేకుండా పోయిందని ప్రజలు చెబుతున్నారు. వారు చేయలేని పనిని ప్రకృతి చేసిందని తెలిపారు. ఇప్పటికైనా హానికారకమైన ఈ కర్మాగారాన్ని మూసేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద విషయమై ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డిని అడగగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

బడిలోనే 'ఆధార్'



మాధారం పాఠశాలలో విద్యార్థి ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

వికారాబాద్ అర్బన్: విద్యాశాఖలో మరింత పారదర్శకత కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలు, వసతిగృహాల్లో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేస్తోంది. పాఠశాల స్థాయిలో కూడా ఈ పద్ధతిని కొనసాగించాలనే ఉద్దేశంతో ప్రతీ విద్యార్థికి ఆధార్ నంబర్ ఉండేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలు పక్కదారి పట్టకుండా, మధ్యాహ్న భోజనం పథకంలో పిల్లల హాజరు శాతాన్ని ఎక్కువ చూపకుండా ఉండేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. జిల్లాలో 50 శాతం మందికిపైగా విద్యార్థులకు ఆధార్ లేకపోవడంతో బయోమెట్రిక్ మిషన్లలో వేలిముద్రలు పడటం లేదు. కొందరికి ఆధార్ ఉన్నా పుట్టిన తేదీ, ఇంటి పేరు తప్పుగా నమోదు కావడం వంటి సమస్యలు నెలకొన్నాయి. వీటిని సరిచేసేందుకు గాను విద్యార్థుల సౌకర్యార్థం ఆధార్ నమోదు, సవరణ, వేలిముద్రల అప్‌డేట్ కోసం పాఠశాలల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మండలానికో ఆపరేటర్ చొప్పున నియమించారు. వీరి ద్వారా జిల్లాలోని అన్ని స్కూళ్లలో విద్యార్థుల బయోమెట్రిక్ వివరాలు స్వీకరిస్తున్నారు.

ప్రయోజనాలివే..

బయోమెట్రిక్ హాజరు ద్వారా పాటు, పాఠ్యపుస్తకాలు పక్కదారి పట్టకుండా చూడటం, మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థుల సంఖ్యను ఎక్కువగా చేసి చూపే అవకాశం ఉండదు. సంక్షేమ వసతి గృహాల్లో పారదర్శకత పెరుగుతుంది.

సరిచేసుకునే అవకాశం

జిల్లాలో మొత్తం 1,030 పాఠశాలలు ఉండగా అందులో 91,898 మంది విద్యార్థులు చదువుతున్నారు. తల్లిదండ్రులకు పెద్దగా అవగాహన లేకపోవడంతో మొదటి ఆధార్ తీసుకున్న సమయంలో చాలా వరకు తప్పుడు సమాచారం నమోదైంది. ప్రస్తుతం పాఠశాలలో నమోదు చేసిన, ఆధార్‌లో నమోదైన పుట్టిన తేదీలు వేర్వేరుగా ఉన్నాయి. కొందరు విద్యార్థుల వేలి ముద్రలు కూడా సరిపోలడం లేదు. వీరు రెసిడెన్షియల్, సంక్షేమ హాస్టళ్లలో చేరేందుకు వెళితే ఆధార్ వివరాలు సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నారు. వీటిని సరిచేసుకోవాలని పిల్లల తల్లిదండ్రులకు తెలిసినా దగ్గర్లో ఆధార్ కేంద్రాలు లేక నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనికి తోడు చాలా మంది విద్యార్థులకు అసలు ఆధార్ కార్డే లేకపోవడం గమనార్హం. ఫలితంగా వీరు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. విద్యార్థుల వివరాలను నమోదు చేయడం ఉపాధ్యాయులకు సైతం సమస్యాత్మకంగా మారింది. వీటన్నింటికీ చెక్ పెట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పాఠశాలల్లో ఆధార్ నమోదు డ్రైవ్ చేపట్టింది. కార్డు లేనివారికి ఉచితంగా ఆధార్ అందించడంతో పాటు, ఇప్పటికే ఉండి తప్పులు ఉంటే సరిచేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఇందుకోసం విద్యార్థులు, తల్లిదండ్రుల వేలిముద్రలు, ఐరిస్ వంటి వివరాలు సేకరిస్తున్నారు.

క్లుప్తంగా

'సాక్షి' సేవలు అభినందనీయం



పదో తరగతి విద్యార్థులకు సాక్షి టెస్ట్‌ పేపర్స్‌ అందజేస్తున్న ప్రత్యేకాధికారి దేవి

కుల్కచర్ల: విద్యార్థుల సౌకర్యార్థం సాక్షి దినపత్రిక అందిస్తున్న పదో తరగతి మోడల్‌ టెస్ట్‌ పేపర్స్‌ ఎంతో ఉపయోగకరమని కుల్కచర్ల కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రత్యేకాధికారి దేవి అన్నారు. శుక్రవారం పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు మోడల్‌ ప్రశ్న పత్రాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల సౌకర్యార్థం సాక్షి దినపత్రిక ఇట్టి కార్యక్రమాన్ని చేపట్టడం ఉపయోగకరమన్నారు.

గ్రామ పంచాయతీలకు కేంద్ర నిధులు ఇవ్వాలి

బీఆర్‌ఎస్‌ కార్మిక విభాగం జిల్లా గౌరవాధ్యక్షుడు కృష్ణయ్య



కొడంగల్‌ రూరల్‌: గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి రావాల్సిన బకాయి నిధులను వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్‌ కార్మిక విభాగం జిల్లా గౌరవ అధ్యక్షుడు కృష్ణయ్య డిమాండ్‌ చేశారు. శుక్రవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి నిధులు రాకపోవడంతో ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. త్వరలో బీఆర్‌ఎస్‌ కార్మిక విభాగం ఆధ్వర్యంలో పంచాయతీ ఉద్యోగులకు పెండింగ్‌ జీతాలు చెల్లించేలా ప్రభుత్వాన్ని కోరనున్నట్లు తెలిపారు.

టీచర్‌పై ఫిర్యాదు



టీచర్‌ కొట్టడంతో విద్యార్థి శరీరంపై ఏర్పడిన గాయం

వికారాబాద్‌ అర్బన్‌: పట్టణంలోని భృంగి ఇంటర్నేషనల్‌ స్కూల్‌లో నాలుగో తరగతి విద్యార్థులను సైన్స్‌ టీచర్‌ చితకబాదినట్లు పిల్లల తల్లిదండ్రులు వికారాబాద్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ పిల్లలపై టీచర్‌ ఇష్టానుసారంగా కొట్టినట్లు వాపోయారు. ఈ విషయాన్ని ఇంట్లో చెప్పవద్దని పాఠశాల ప్రిన్సిపాల్‌, యాజమాన్యం పిల్లలను బయపెట్టినట్లు తెలిపారు. వేల రూపాయల ఫీజు తీసుకుంటున్న పాఠశాల యాజమన్యాం పిల్లల రక్షణపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత టీచర్‌పై కేసు నమోదు చేయాలని వారు డిమాండ్‌ చేశారు.

స్వర్ణ రుద్రాక్ష మాల బహూకరణ

షాద్‌నగర్‌ టౌన్‌: పట్టణంలోని శివమారుతీ ఆలయంలో కొలువుదీరిన అయ్యప్ప స్వామికి శుక్రవారం పట్టణంలోని గాంధీనగర్‌ కాలనీకి చెందిన మంజుల, ప్రతాప్‌కుమార్‌ దంపతులు స్వర్ణ రుద్రాక్ష మాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సంతోష్‌, సునీల్‌, ఆలయ కమిటీ అధ్యక్షుడు గోలెపు చంద్రమౌళి, బసప్ప, విశ్వం, రాఘవేందర్‌, చింటు, ప్రవీణ్‌, ముత్యాలు, రాజావరప్రసాద్‌, హర్షవర్ధన్‌ గౌడ్‌, శశికుమార్‌, శ్యాం, శ్రీకాంత్‌, చరణ్‌, పవన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆనకట్ట.. ఒట్టిమాటేనా?

- పునాది దశలో ఆగిన పనులు
- మూడేళ్లు కావస్తున్నా కానరాని పురోగతి
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న రైతన్నలు
- త్వరలో పనులు: ఇరిగేషన్‌ డీఈఈ



పనుల ప్రారంభ సమయంలో వేసిన శిలాఫలకం



ఆనకట్ట నిర్మించాల్సిన ప్రాంతం ఇదే

ధారూరు: మండలంలోని దోర్నాల్‌ గ్రామ సమీపంలో పెద్ద వాగుకు అడ్డంగా ఆనకట్ట నిర్మించాలని ప్రభుత్వం సంకల్పించింది. మూడేళ్ల క్రితం మంత్రి సబితారెడ్డి ఇందుకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేశారు. కానీ ఇప్పటి వరకు పనుల్లో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. భూగర్భ జలాలు వృద్ధి కోసం ఈ ప్రాజెక్టును నిర్మించాలని భావించారు. ఉద్దేశం మంచిదే అయినా పాలకులు, అధికారుల అలసత్వం కారణంగా పనులు ముందుకు సాగడం లేదు. 2020 జూన్‌ 11న మండలంలోని పెద్ద వాగుకు అడ్డంగా ఆనకట్ట నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి అరవై ఒక్క లక్షాయాభై వేల రూపాయలు మంజూరు చేసింది. వాగు అవతల ఉన్న పొలాలకు దారి సౌకర్యంతో పాటు భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని రైతులు భావించారు. కాంట్రాక్టర్‌ పునాది స్థాయిలో పనులు చేస్తుండగా వాగు ప్రవాహ కారణంగా పనులు ఆపేశాడు. 2 సంవత్సరాలు అవుతున్నా తిరిగి పనులు చేపట్టలేదు. 2020, 2021 సంవత్సరాల్లో ఎలాంటి పనులు మొదలుపెట్టలేదు. అయితే ప్రతి ఏటా వర్షాకాలం ప్రారంభం కాకముందే పనులు పూర్తవుతాయని రైతులు భావించడం, ఆ తర్వాత నిరాశ చెందడం పరిపాటిగా మారింది.

పనులు పూర్తయితే పొలాలకు మేలు

పెద్ద వాగుపై ఆనకట్ట నిర్మిస్తే పంటల సాగుకు అనుకూలంగా ఉంటుంది. రెండేళ్ల క్రితం తూతూ మంత్రంగా పనులు ప్రారంభించి ఆపేశారు. వానాకాలంలో వాగు అవతల ఉన్న పొలాలకు వెళ్లాలంటే కష్టంగా ఉంటుంది. గతంలో వాగు దాటబోయి ఓ వ్యక్తి చనిపోయాడు. మరో వ్యక్తి ఈదుకుంటూ ప్రాణాలు కాపాడుకున్నాడు. మూగజీవాలు తరచూ మృత్యువాత పడుతున్నాయి. ఆనకట్ట నిర్మిస్తే రైతులకు మేలు చేకూరుతుంది. అంతేకాకుండా భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. తద్వార వ్యవసాయ బోర్లు, బావుల్లో నీరు పుష్కలంగా ఉంటాయి.

– దోర్నాల రైతులు

త్వరలో పనులు ప్రారంభిస్తాం

పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌ వికారాబాద్‌ – తాండూర్‌ వయా ధారూరు మార్గంలో వంతెనల నిర్మాణ పనులు చేస్తుండడం వల్ల పెద్దవాగుపై వంతెన పనులు ప్రారంభించలేదు. గత సంవత్సరం పనులు ప్రారంభించినా వర్షాల కారణంగా చేపట్టలేకపోయాం. వాగుకు వరదలు నెలల తరబడి రావడం వల్ల పనులు చేసేందుకు వీలు లేకుండా పోయింది. ఈ సీజన్‌లో పనులను ప్రారంభిస్తాం.

– రవి, ఇరిగేషన్‌ డీఈ, వికారాబాద్‌

రాష్ట్రంలో బీజేపీదే అధికారం

మాజీ మంత్రి చంద్రశేఖర్‌



మాట్లాడుతున్న మాజీ మంత్రి చంద్రశేఖర్‌

బంట్వారం: రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆ పార్టీ సీనియర్‌ నేత, మాజీ మంత్రి డాక్టర్‌ ఏ చంద్రశేఖర్‌ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం బంట్వారం, కోట్‌పల్లి మండలాల్లోని బస్వాపూర్‌, తొర్మామిడి, సల్బత్తాపూర్‌, రాంపూర్‌ గ్రామాల్లో శక్తి కేంద్ర కార్నర్‌ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అస్సెంబ్లీ పాలక్‌, సినీ నటి జీవితతో కలిసి మాట్లాడారు. బూత్‌ స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కష్టపడిన వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. యువత చేతిలోనే దేశ భవిత ఉందన్నారు. రాష్ట్రంలో అవినీతి పాలనకు చరమగీతం పాడాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. వికారాబాద్‌ గడ్డపై బీజేపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్‌, సీనియర్‌ నాయకులు బసిరెడ్డి పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌ రాజకీయాలు సరికావు

- ప్రజల చూపు బీజేపీ వైపే
- పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందారెడ్డి

తాండూరు రూరల్‌: పట్టణంలో రోజురోజుకూ బీఆర్‌ఎస్‌ ఫ్యాక్షన్‌ రాజకీయాలు పెరిగిపోతున్నాయని, ఇది సరైన పద్ధతి కాదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందారెడ్డి హితవు పలికారు. శుక్రవారం మండలంలోని జినుగుర్తి గ్రామంలో బీజేపీ కార్నర్‌ మీటింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కార్నర్‌ మీటింగ్‌లు నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో రోజురోజుకూ బీజేపీ బలం పెరుగుతోందని, ప్రజల చూపు బీజేపీవైపే ఉందన్నారు. అధికార బీఆర్‌ఎస్‌ పార్టీపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందన్నారు. తాండూరులో ఎమ్మెల్యే పైలెట్‌ రోహిత్‌రెడ్డి హత్యా రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. దాడులు చేయడం తెలంగాణ సంస్కృతి కాదని హితవు పలికారు. తాండూరులో జరుగుతున్న పరిణామాలు ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్‌ రజనీకాంత్‌, బీజేపీ మండల అధ్యక్షుడు శేఖాపురం ఆంజనేయులు, నాయకులు నక్కల రమేష్‌, కృష్ణ, మహేందర్‌, చిరంజీవి, నరేందర్‌, సతీష్‌, రామ్‌ పంతులు పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడుదాం

కమిషన్‌ సభ్యులు దేవయ్య



సమావేశంలో మాట్లాడుతున్న దేవయ్య

వికారాబాద్‌ అర్బన్‌: ప్రతి ఒక్కరూ బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ సభ్యులు ఏ దేవయ్య అన్నారు. శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ కోసం చేపడుతున్న కార్యక్రమాలపై ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల కార్మిక వ్యవస్థ, పోక్సో చట్టం అమలు, జిల్లా స్థాయి బాలల హక్కుల పరిరక్షణ విభాగం పనితీరు బాగుండాలన్నారు. బాలల ఆరోగ్యం, విద్య వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. బాలికలు లైంగిక వేధింపులు, అత్యాచారాలకు గురికాకుండా పోక్సో చట్టం కఠినంగా అమలు చేయాలన్నారు. చట్టాలపై పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రత్యేకంగా యువత, ఆటో డ్రైవర్లు వంటి వారికి ప్రత్యేక అవగాహన కార్యక్రమం చేపట్టాలని సూచించారు. బాలికలపై అత్యాచారాలు జరిగితే వెంటనే విచారణ చేపట్టి వారికి న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి వసతి గృహంలో, పాఠశాలల్లో ఫిర్యాదుల బాక్స్‌ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ఉన్నందున బాల్యవివాహాలు కూడా అధికంగా అవుతున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయిలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. విలేజ్‌ చైల్డ్‌ ప్రొటెక్షన్‌ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ అశోక్‌కుమార్‌, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, డీఈఓ రేణుకాదేవి, ట్రైబల్‌ వెల్ఫేర్‌ ఆఫీసర్‌ కోటాజీ, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి మల్లేశం, అడిషనల్‌ ఎస్పీ మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య



విజయ్‌కుమార్‌ మృతదేహం

కుల్కచర్ల: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. షాద్‌నగర్‌ పట్టణానికి చెందిన క్షీరసాగర తారాబాయి కుమారుడు విజయ్‌కుమార్‌ ముజాహిద్‌పూర్‌కు చెందిన బొడికె నర్సుబాయిని వివాహం చేసుకొని ఇల్లరికం వచ్చాడు. వీరికి ఇద్దరు పిల్లలు. విజయ్‌కుమార్‌ ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని చనిపోయాడు. తన కొడుకు కోడలు తరచూ గొడవ పడేవారని, కుమారుడి మరణంపై అనుమానం ఉందని తల్లి తారబాయి పోలీసులకు పిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గిరి తెలిపారు.

మొక్కల రక్షణ గాలికి..!



ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారిలో పడిపోయిన మొక్కలు, జాలీలు

- నాటడంపై ఉన్న శ్రద్ధ రక్షణపై లేదు
- ప్రభుత్వ కార్యాలయాల వద్దే ఎండిన మొక్కలు
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం



పెద్దేముల్‌ ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎండిన హరితహారం మొక్క

పెద్దేముల్‌: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమం సిబ్బంది నిర్లక్ష్యం వల్ల నీరుగారుతోంది. ఏటా ప్రభుత్వం గ్రామాల్లో వేల సంఖ్యలో మొక్కలు నాటి.. వాటి సంరక్షణ కోసం లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తోంది. కానీ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల మొక్కలు ఎండిపోతున్నాయి. ప్రధాన రహదారులపై నాటిన మొక్కలకు రక్షణ లేకుండా పోయింది. అంతేకాకుండా నాటిన గుంతల్లోనే మళ్లీ మొక్కలు నాటి లెక్కలు చూపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం మండల అధికారులకు తెలిసినా వారు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. హరితహారం, పల్లె ప్రగతి కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో 37 వన నర్సరీలను ఏర్పాటు చేశారు. ఒక్కో నర్సరీలో 5 వేల మొక్కలకు తగ్గకుండా పెంచుతున్నారు. ఇందుకోసం ఏటా లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా వన నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలు సంరక్షణ గ్రామ పంచాయతీ అధికారులకు అప్పగించారు. కానీ పంచాయతీ అధికారులు మొక్కలు నాటడంపై చూపుతున్న శ్రద్ధ వాటి సంరక్షణపై పెట్టడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. పెద్దేముల్‌ మండల పరిషత్‌ కార్యాలయం వద్ద నాటిన మొక్కలు ఎండిపోయాయి. వాటి రక్షణ కోసం ఏర్పాటు చేసిన జాలీలు పడిపోయినా పట్టించుకునే నాథులే కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల వద్దే పరిస్థితి ఇలా ఉంటే గ్రామాల్లో పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని హైదరాబాద్‌, జహీరాబాద్‌, సంగారెడ్డి ప్రధాన రహదారులపై, మంబాపూర్‌, ఇందూరు, కందనెల్లి, మన్‌సాన్‌పల్లి, ఆత్కూర్‌ గ్రామాల్లో నాటిన మొక్కలకు నీరు అందక ఎండిపోతున్నాయి. పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణ, ప్రధాన రహదారులు, ప్రభుత్వ భూములు, ఆలయ స్థలాల్లో మొక్కలు నాటారు. వీటి బాధ్యతను పంచాయతీ సిబ్బందికి అప్పగించారు. ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓలకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. గత ఏడాది పలు గ్రామాల్లో రూ. 150నుంచి రూ.180 వరకు వెచ్చించి ఒక్కో మొక్కను కొనుగోలు చేసి రోడ్ల పక్క నాటారు. కానీ ఎక్కడా మొక్కలు పెరిగిన దాఖలాలు లేవు. ఈ విషయమై ఎంపీడీఓ లక్ష్మప్పను వివరణ కోరగా మొక్కలు ఎండిపోతే పంచాయతీ కారదర్శులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఫార్మాసిటీకి బీజేపీ వ్యతిరేకం

భూసేకరణలో కుంభకోణాలు

- మేం అధికారంలోకి వస్తే విచారణ జరిపిస్తాం
- పార్టీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా

యాచారం: ఫార్మాసిటీకి బీజేపీ పూర్తి వ్యతిరేకమని, కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేవని ఆ పార్టీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు బాషా పేర్కొన్నారు. మండలంలోని నానక్‌నగర్‌ గ్రామంలో గురువారం రాత్రి ప్రజా గోస – బీజేపీ భరోసా కార్నర్‌ మీటింగ్‌ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మాసిటీ పేరుతో కేసీఆర్‌ సర్కార్‌ పేదల అసైన్డ్‌ భూములను తీసుకుని రియల్‌ వ్యాపారం చేసిందన్నారు. కొంత మంది రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ నేతలు కలిసి భూసేకరణలో అక్రమాలు, అవకతవకలకు పాల్పడ్డారని ఆరోపించారు. వందలాది ఎకరాలను బీనామిల పేర్ల మీద డబ్బులిచ్చి కోట్లాది రూపాయల కుంభకోణాలకు పాల్పడ్డారని అన్నారు. ఫార్మాసిటీ వ్యతిరేక ఉద్యమానికి బీజేపీ అండగా ఉంటుందన్నారు. మేం అధికారంలోకి వచ్చిన వెంటనే భూసేకరణలో జరిగిన అక్రమాలపై పూర్తి విచారణ చేపడతామని పేర్కొన్నారు. యాచారం మండలంలో మైనింగ్‌ జోన్‌, కొత్తపల్లి గ్రామంలో బొక్కల కంపెనీని మూసేయాలని ఎలా ఆందోళన, నిరాహార దీక్షలు చేస్తున్నారో.. అదే తరహాలో ఫార్మాసిటీ రద్దు కోసం ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్‌, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పుప్పాల శాంతికుమార్‌, మండల ప్రధాన కార్యదర్శి సంగెం శ్రీనాథ్‌, నాయకులు మంద శేఖర్‌, నల్లోల వెంకటేష్‌, కట్టెల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కూలీకి ఉపాధి పని కల్పిస్తాం

డీఆర్‌డీఓ పీడీ ప్రభాకర్‌



చింతపట్లలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ పీడీ ప్రభాకర్‌

యాచారం: జాబ్‌ కార్డు ఉన్న ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పిస్తామని డీఆర్‌డీఓ పీడీ ప్రభాకర్‌ పేర్కొన్నారు. మండలంలోని చింతపట్ల గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం ఎన్ని గంటలకు పనులకు వస్తున్నారు, పనులు ప్రారంభించే సమయంలో, పనులు చేసే సమయంలో ఫొటోలు తీస్తున్నారా.. నిబంధనల ప్రకారం పనులు చేస్తున్నారా.. రికార్డుల నమోదు, కూలీల సంఖ్యపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని బృహత్‌ పల్లె ప్రకృతి వనం, నర్సరీలను సందర్శించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో మొక్కలు ఎండిపోకుండా వారానికి మూడు రోజుల పాటు నీళ్లు అందించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా రోజూ 7 వేల మందికి పైగా కూలీలకు ఉపాధి పనులకు వస్తున్నారని తెలిపారు. రాబోయే వారం, పది రోజుల్లో ప్రతి గ్రామంలో 250కి మించి కూలీలు ఉపాధి పనులు చేసేలా చైతన్యం కల్పిస్తామన్నారు. కూలీలకు వారం, వారం డబ్బులు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈజీఎస్‌ ఏపీఓ లింగయ్య, ఈసీ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదంలో 15 మందిపై కేసు

పరిగి: భూ వివాదంతో 15 మందిపై కేసు నమోదయ్యింది. ఈ సంఘటన పూడూర్‌ మండలం చన్‌గోముల్‌ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి కథనం మేరకు.. చన్గోముల్‌ గ్రామ సర్వే నంబర్‌ 3 6లో 4 ఎకరాల భూమిని సంగారెడ్డికి చెందిన గడీల శ్రీనివాస్‌గౌడ్‌ గ్రామానికి చెందిన కమాల వీరమణి, కమల సోమలింగం వద్ద కొనుగోలు చేశాడు. కొనుగోలు చేసిన పొలం చుట్టూ ఫెన్సింగ్‌ వేశాడు. అయితే గ్రామానికి చెందిన ఎండీ అజీం, అజారుద్దీన్‌, రహీస్‌ ఖాన్‌, జహీర్‌ఖాన్‌, నజీబ్‌ ఖాన్‌, కొంగి సత్తయ్య, కొమ్ము కృష్ణ, సిరాజుద్దీన్‌ ఫెన్సింగ్‌ను తొలగించారు. దీంతో బాధితుడు శ్రీనివాస్‌గౌడ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ప్రయోగాత్మక విద్యతో లాభాలు

కొత్తూరు: ప్రయోగాత్మతకంగా విద్యాబోధన చేపడితే విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థమవుతాయని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్‌ అధికారి (సీఎంఓ) కృష్ణయ్య సూచించారు. మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామ జెడ్పీహెచ్‌ఎస్‌లో పీఅండ్‌జీ పరిశ్రమ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పరిశ్రమ ఆర్థిక సహకారంతో మైండ్‌ స్పార్క్‌ సంస్థ సమకూర్చిన కంప్యూటర్‌ మోడల్‌ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు దృశ్య, వీక్షణ ద్వారా పాఠ్యాంశాలు బోధిస్తే వారికి విషయ పరిజ్ఞానం పెరగడంతో పాటు చాలాకాలం వరకు గుర్తుంటాయన్నారు. కరోనా కారణంగా చదువులో వెనకబడిన విద్యార్థులకు ఇలాంటి బోధన ఎంతో ఉపయోగకరమని అన్నారు. కార్యక్రమంలో మైండ్‌ స్పార్క్‌ సంస్థ ప్రతినిధి విశ్వనాథ్‌, ఎంఈవో కృష్ణయ్య, పాఠశాల హెచ్‌ఎం పాల్గొన్నారు.

భూ వివాదంలో దోమ ఎస్‌ఐ!

దోమ: భూ వివాదంలో ఎస్‌ఐ విశ్వజన్‌ తలదూర్చారు. ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వికారాబాద్‌ పట్టణానికి చెందిన యాదగిరి రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం చేస్తుంటాడు. నవాబుపేట మండలంలో విధులు నిర్వహిస్తున్న సమయంలోనే ఎస్‌ఐ విశ్వజన్‌కు యాదగిరితో పరిచయం ఏర్పడింది. ఎక్కడైనా భూమి ఉంటే చెప్పండి కొనుగోలు చేస్తానని ఎస్‌ఐ రియల్లర్‌ను కోరినట్లు తెలిసింది. ఈ క్రమంలో నవాబుపేట మండలం కేశవపల్లిలో రైతు హన్మంతుకు చెందిన 21 గుంటల పొలం కొనేందుకు ఎస్‌ఐ రూ. 32 లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా రూ. 9 లక్షలు ఇచ్చి తన స్నేహితుడిపై అగ్రిమెంట్‌ చేయించాడు. మిగత డబ్బు ఆరు నెలల తర్వాత నేరుగా రైతు అకౌంట్‌లో వేసి ఎస్‌ఐ తన స్నేహితుడి పేరిట రిజిస్ట్రేషన్‌ చేయించుకున్నాడు. ఇదిలా ఉండగా సదరు రైతు నవాబుపేటలో ఓ ప్లాట్‌ కొనుగోలు చేయడానికి సిద్ధమయ్యాడు. ఇందుకోసం రియల్టర్‌ యాదగిరిని సంప్రదించాడు. రూ. 18 లక్షలకు ఆ ప్లాట్‌ను రైతుకు ఇప్పించేందుకు యాదగిరి ఒప్పందం కుదుర్చాడు. ఇందులో భాగంగా ఎస్‌ఐ ఇచ్చిన రూ. 9లక్షలతో పాటు రైతు వద్ద మరో రూ. రెండు లక్షలు తీసుకొని ప్లాట్‌ యజమానికి ఇచ్చి ఒప్పందం చేసుకున్నాడు. ఇదిలా ఉండగా రైతు ప్లాట్‌ను రిజిస్ట్రేషన్‌ చేయించుకోలేదు. ఈ విషయమై రియల్టర్‌ యాదగిరి అడగ్గా తన వద్ద డబ్బు లేదని తాను ఇచ్చిన రూ. 11 లక్షలు తిరిగి ఇప్పించాలని కోరాడు. ఇదే విషయాన్ని రియల్టర్‌ ప్లాటు యజమానికి తెలిపాడు. అయితే పాట్లు యజమాని తన వద్ద ఇప్పుడు అంత డబ్బు లేదని రైతు ఇచ్చిన రూ.11 లక్షల్లో రూ. 5 లక్షలు తిరిగి ఇచ్చాడు. ఈ డబ్బును ఎస్‌ఐ స్నేహితుడి అకౌంట్‌లో వేసినట్లు రియల్టర్‌ తెలిపారు. ఈ విషయంపై ఎస్‌ఐ విశ్వజన్‌ను వివరణ కోరగా.. నవాబుపేటలో 20 గుంటల భూమిని తన స్నేహితుడికి రియల్టర్‌ యాదగిరి రూ.32 లక్షలకు ఇప్పించాడు. అందులో రూ. 8 లక్షలు రైతుకు ఇస్తానని తీసుకున్న రియల్టర్‌ తన స్నేహితుడిపై భూమి అగ్రిమెంట్‌ చేయించాడు. అగ్రిమెంట్‌ చేయించిన తర్వాత ఆరు నెలలైన తన స్నేహితుడికి భూమిని రిజిస్ట్రేషన్‌ చేయించలేదు. తన వద్దకు రాలేదు. దీంతో అనుమానం వచ్చి రైతును తాను ప్రశ్నించగా తనకు రియల్టర్‌ డబ్బులు ఇవ్వలేదు అని చెప్పాడు. అగ్రిమెంట్‌కు ఇచ్చిన డబ్బులను రియల్టర్‌ యాదగిరి తన సొంత అవసరాలకు వాడుకొని రైతుకు ఇవ్వలేకపోయాడు. ఇట్టి విషయం గట్టిగా రియల్టర్‌ను అడుగగా రూ. 8 లక్షల్లో కొన్ని రైతుకు ఇచ్చాడు. మిగత రూ.3 లక్షల 50 వేలు ఇవ్వలేకపోయాడు. అట్టి డబ్బులను మీరు ఇప్పించండి అంటూ రైతు ఎస్‌ఐని కోరి భూమిని రిజిస్ట్రేషన్‌ చేయించాడు. మిగత డబ్బులు రోజులు గడుస్తున్న రియల్టర్‌ ఇవ్వకపోవడంతో రైతు తనకు, తన స్నేహితుడికి కాల్‌ చేయడం ప్రారంభించాడు. దీంతో తాను ఈ విషయంపై రియల్టర్‌ను గట్టిన ప్రశ్నించానని ఎస్‌ఐ విశ్వజన్‌ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ. 6లక్షల విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఉమాకాంతం

శంకరపల్లి: పట్టణంలో అయ్య ప్ప ఆలయం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బీఆర్‌ఎస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు సాత ప్రవీణ్‌కుమార్‌ కోరారు. శుక్రవారం శంకర్‌పల్లికి చెందిన జీ ఉమాకాంతం అయ్యప్ప ఆలయం నిర్మాణానికి రూ. 6లక్షల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయ్యప్ప ఆలయం నిర్మాణానికి భక్తులు ముందుకు రావాలన్నారు. బీఆర్‌ఎస్‌ మున్సిపల్‌ యువజన విభాగం అధ్యక్షుడు పాండురంగారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌, కే జంగయ్య, శ్రీనివాస, రాంరెడ్డి పాల్గొన్నారు.